క్లుప్తంగా

పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి సీఎం కృషి



వాహనాలకు జెండా ఊపుతున్న డిప్యూటీ డీఈఓ, నగర పంచాయతీ చైర్మన్

బేతంచెర్ల: పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని డిప్యూటీ డీఈఓ సుధాకర్ రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ వద్ద జగనన్న విద్యాకానుక కిట్లను ఆయా పాఠశాలలకు ఆటోలో తరలించే కార్యక్రమాన్ని వారు జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుక కిట్టు అందజేస్తామన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



విష్ణు సహస్రనామ పారాయణంలో పాల్గొన్న దాతలు

బేతంచెర్ల: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని పూదోట ఆశ్రమ నిర్వాహకులు గుండా గోపాలు, గౌరి హుసేన్‌రెడ్డి, భజన కృష్ణయ్య, డాక్టర్ నరసింహులు అన్నారు. పట్టణంలోని పూదోట ఆశ్రమంలో లోకకల్యాణార్థం కొనసాగుతున్న విష్ణు సహస్రనామ సోత్ర సామూహిక పారాయణంలో పాల్గొన్న భక్తులకు సోమవారం వారు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 30 వరకు నిర్విరామంగా కొనసాగే ఈ పారాయణంలో భక్తులు పాల్గొని భగవంతుని అనుగ్రహానికి పాత్రులు కావాలన్నారు. కార్యక్రమంలో దాతలు తిరుమల శ్రీను, రాజేంద్ర, చంద్రమోహన్‌రెడ్డి, బుగ్గన రాజేష్ రెడ్డి, నారాయణమ్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

డోన్ టౌన్: సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దని ఆర్డీఓ వెంకటరెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సంబంధిత శాఖలకు ఆయా వినతిపత్రాలు బదిలీ చేస్తూ త్వరగా పరిష్కారించాలని ఆదేశించారు.

బేతంచెర్ల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ వెంగన్న ప్రజల నుంచి వినతులు స్వీకరించి వీలైనంత త్వరగా పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ రమేష్‌బాబు, ఏఓ కిరణ్ కుమార్, ఆర్ఐ శ్రీదేవి, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

బ్రిడ్జి పనులు పరిశీలన

బేతంచెర్ల: అయ్యల చెర్వు నుంచి పట్టణం వరకు జరుగుతున్న నాలుగు లేన్ల రహదారి పనులను నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి సోమవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

రోడ్డుప్రమాదంలో పలువురికి గాయాలు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తిమ్మనాయునిపేట సమీపంలో సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో పలువురు గాయపడ్డారు. అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి ఆటోలో ఓ కుటుంబం వైఎస్ఆర్ కడప జిల్లా జమ్మలమడుగు సమీపంలోని గుర్రప్పస్వామి దర్శనార్థం బయలు దేరారు. మార్గమధ్యలో తిమ్మనాయినపేట సమీపంలోని బ్రహ్మంగారిమఠం వద్దకు చేరుకోగానే ఆటో టైర్ పగిలి బోల్తా పడింది. అదే సమయంలో తిమ్మనాయినపేటకు చెందిన నన్నా ఎస్.చెన్నంపల్లె సమీపంలో ఉపాధి పనులు జరుగుతుండటంతో హసీనా, నసీబా అనే మహిళలను బైక్‌పై వదిలిపెట్టేందుకు బయలు దేరారు. సరిగ్గా మఠం వద్దకు రాగానే ఆటో టైర్ పగలడంతో బైక్‌ను ఢీకొని బోల్తా పడింది. ప్రమాదంలో బైక్‌లోని ముగ్గురు స్వల్పంగా గాయపడగా, ఆటోలో ఉన్న ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను నంద్యాల, జమ్మలమడుగు ఆసుపత్రులకు తరలించారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి

అవుకు: ఎంపీడీఓగా జి.వెంకటేశ్వరరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న అజాం ఖాన్ కర్నూలు రూరల్ ఎంపీడీఓ కార్యాలయానికి, గూడూరులో ఏఓగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరెడ్డిని అవుకు ఎంపీడీఓగా బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నూతన ఎంపీడీఓ మాట్లాడుతూ మండల అభివృధికి కృషి చేస్తానన్నారు.

పరుగులు పెడుతున్న రైళ్లు

- చేరువైన రైలు ప్రయాణం
- తిరుపతి రైలుకు తగ్గని రద్దీ
- రాష్ట్ర రాజధాని అమరావతికి ప్రయాణం సులభతరం
- నంద్యాల- ఎర్రగుంట్ల మార్గంలో పెరిగిన రైళ్ల రాకపోకలు



కోవెలకుంట్ల వద్ద పరుగులు పెడుతున్న డెమో రైలు

కోవెలకుంట్ల: నంద్యాల- ఎర్రగుంట్ల రైల్వే మార్గంలో రైళ్లు పరుగులు పెడుతున్నాయి. ఉమ్మడి కర్నూలు- వైఎస్సార్ జిల్లాలను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు నంద్యాల నుంచి వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్ల వరకు 130 కి.మీ మేర రైల్వేలైన్ ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, ఉప్పలపాడు, నొస్సం, సంజామల, కోవెలకుంట్ల, బనగానపల్లె, మద్దూరు ప్రాంతాల్లో రైల్వేస్టేషన్లు ఉన్నాయి. రెండు జిల్లాల ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 2016 ఆగస్టు నుంచి ఈ మార్గంలో రైళ్ల రాకపోకలు కొనసాగుతున్నాయి. నంద్యాల నుంచి కడప వరకు డెమో, అనంతపురం జిల్లా ధర్మవరం నుంచి రాష్ట్ర రాజధాని అమరావతి మీదుగా మచిలీపట్నం వరకు, గుంటూరు నుంచి తిరుపతికి ప్రతి రోజు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు ఆయా జిల్లాల పారిశ్రామిక అభివృద్ధికి గూడ్స్ రైళ్లు తిరుగుతున్నాయి. ప్రయాణికులకు రైలు ప్రయాణం మరింత సులభతరం చేసేందుకు రూ.50 కోట్లతో విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. గత ఏడాది మార్చి 29 నుంచి ఈ మార్గంలో విద్యుత్ రైళ్ల రాకపోకలు కొనసాగుతున్నాయి. డీజిల్ ద్వారా నడిచే రైలు ప్రయాణం కంటే విద్యుత్ రైళ్ల ప్రయాణం వల్ల త్వరగా గమ్యస్థానాలకు చేరుకుంటుండటంతో ప్రజలు రైలు ప్రయాణం వైపే మొగ్గు చూపుతున్నారు.

తిరుపతి రైలుకు తగ్గని రద్దీ..

నంద్యాల-ఎర్రగుంట్ల మార్గంలో గత ఏడాది ఆగస్టు 18వ తేదీ నుంచి గుంటూరు – తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలు నడుస్తోంది. గుంటూరు, నరసరావుపేట, వినుకొండ, మార్కాపురం, గిద్దలూరు, నంద్యాల, బనగానపల్లె, ప్రొద్దుటూరు, కడప, రాజంపేట, రేణిగుంట రైల్వేస్టేషన్లలో మాత్రమే ఎక్స్‌ప్రెస్ రైలు ఆగేది. రెండు జిల్లాల ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల అభ్యర్థన మేరకు గత ఆరు నెలల నుంచి నంద్యాల జిల్లా కోవెలకుంట్ల, వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు రైల్వేస్టేషన్లలో స్టాపింగ్ ఏర్పాటు చేశారు. తిరుపతి వెంకన్నస్వామి దర్శనానికి రైలు ప్రయాణం దగ్గరి మార్గం కావడంతో తిరుపతి రైలుకు భక్తుల రద్దీ తగ్గడం లేదు. గతంలో గుంటూరు, ప్రకాశం జిల్లాల ప్రజలు రైలు మార్గం ద్వారా తిరుపతికి వెళ్లాలంటే విజయవాడ మీదుగా, నంద్యాల, వైఎస్సార్ జిల్లా ప్రజలు కడప వరకు బస్సు, రైలు మార్గం ద్వారా చేరుకుని అక్కడి నుంచి తిరుపతికి వెళ్లాల్సి వచ్చేది. ప్రయాణికులు అనేక వ్యయప్రయాసలు ఎదుర్కొని రాకపోకలు సాగించేవారు. తిరుపతి రైలు పట్టాలెక్కడంతో ఆయా జిల్లాల ప్రజలకు రైలు ప్రయాణం మరింత చేరువైంది. దైవదర్శనంతో పాటు ఆయా జిల్లాల్లోని వివిధ ముఖ్య పట్టణాలకు బస్సు ప్రయాణం కంటే రైలు ప్రయాణం దగ్గరి మార్గం కావడంతో సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయా పట్టణాల్లో బంగారు ఆభరణాలు, పట్టుచీరెలు, వస్త్ర, తదితర వ్యాపార నిమిత్తం ప్రజలు, వ్యాపారాలు రైలు ప్రయాణం సాగిస్తున్నారు. దీంతో ఆయా జిల్లాల్లో పారిశ్రామిక అభివృద్ధి పరుగులు పెడుతోంది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తిరుపతి రైలుకు అదనంగా జనరల్ బోగీలు ఏర్పాటు చేయాలని ఆయా జిల్లాల ప్రయాణికులు రైల్వేశాఖ అధికారులను విన్నవించుకుంటున్నారు.

మరికొన్ని రైళ్లు నడపాలని ప్రతిపాదన

కేంద్ర మాజీ హోం సహాయమంత్రి, బిహార్, కర్ణాటక రాష్ట్రాల గవర్నర్‌గా పనిచేసిన సంజామల వాసి దివంగత పెండేకంటి వెంకటసుబ్బయ్య కలల సాకారమైన నంద్యాల- ఎర్రగుంట్ల రైల్వే మార్గంలో రైళ్ల రాకపోకలు క్రమంగా పెరుగుతున్నాయి. రాకపోకలు ప్రారంభమైన మొదట్లో నంద్యాల నుంచి కడప వరకు వారంలో ఆరు రోజులు డెమో రైలు నడిచేది. తర్వాత ఆరు నెలలకు ధర్మవరం నుంచి రాష్ట్ర రాజధాని అమరావతికి వారంలో మూడు రో జులు మాత్రమే ఎక్స్‌ప్రెస్ రైలు తిరిగేది. 2018 నుంచి డెమో రైలును వైఎస్సార్ జిల్లా పెండ్లిమర్రి వరకు పొడగించడంతోపాటు ఎక్స్‌ప్రెస్ రైలుతో సహా రెండు రైళ్లు ప్రతి రోజు నడిచేలా రైల్వే అధికారులు చర్యలు తీసుకున్నారు. వీటితో పాటు గత ఏడాది ఆగస్టు నుంచి తిరుపతికి ఎక్స్‌ప్రెస్ రైలు నడుస్తోంది. అలాగే ఉత్తర భారతదేశానికి రైలు కనెక్టివిటీని విస్తరించేందుకు 2020 నుంచి ఈ మార్గంలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రైలు నడపాలని ప్రతిపాదన ఉండేది. ఆ ఏడాది కరోనా వైరస్ విజృంభించడంతో ఆ ప్రతిపాదనను రైల్వే అధికారులు రద్దు చేశారు. తిరిగి ఈ ప్రతిపాదనపై రైల్వే శాఖ దృష్టి సారించింది. రాబోయే రోజుల్లో ఈ రైలు పట్టాలెక్కితే నంద్యాల, ఉమ్మడి వైఎస్సార్ జిల్లాల ప్రజలకు రైలు ప్రయాణం మరింత చేరువకానుంది.

రైలు ప్రయాణం సులభతరం



నంద్యాల- ఎర్రగుంట్ల రైల్వేమార్గంలో ప్రయాణికులకు రైలు ప్రయాణం సులభతరమైంది. గతంలో ఈ ప్రాంత ప్రజలు తిరుపతి, అమరావతి, తదితర ముఖ్య పట్టణాలకు బస్సు మార్గంలో వెళ్లాల్సి వచ్చేది. దీంతో అనేక వ్యయ ప్రయాసలు ఎదుర్కొనేవారు. ఆయా ప్రాంతాలకు రైళ్లు నడుస్తుండటంతో ప్రజలకు రైలు ప్రయాణం మరింత చేరువైంది. – సుబ్బరాయుడు, కోవెలకుంట్ల

అదనపు బోగీలు ఏర్పాటు చేయాలి



గుంటూరు నుంచి నంద్యాల, కోవెలకుంట్ల మీదుగా ప్రతి రోజు తిరుపతికి ఎక్స్‌ప్రెస్ రైలు నడుస్తోంది. రైలుకు రెండు మాత్రమే జనరల్ బోగీలు ఉన్నాయి. తిరుపతి వెంకటేశ్వర స్వామి దర్శనానికి ప్రతి రోజు వందలాది మంది భక్తులు వెళుతున్నారు. జనరల్ బోగీలు తక్కువగా ఉండటంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మరో రెండు జనరల్ బోగీలు ఏర్పాటు చేయాలి. – గుర్రప్ప, కోవెలకుంట్ల

సేవాగుణం అలవర్చుకోవాలి



లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ సేవా భావం అలవర్చుకుని తమ సంపాదనలో కొంత మొత్తాన్ని దాన ధర్మాలకు వెచ్చించాలని ప్రకృతి పీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి అన్నారు. అనాథలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రతి నెలా అందజేసే పింఛన్ల ప్రక్రియను సోమవారం స్థానిక పరంధామ నిలయంలో చేపట్టారు. పట్టణానికి చెందిన 150 మందికి రూ.100 చొప్పున అందజేశారు. కార్యక్రమంలో మాజీ సైనిక ఉద్యోగి పెద్దిరెడ్డి, రిటైర్డ్ హెచ్ఎం నారాయణస్వామి, వాల్మీకి సంఘం నాయకుడు సుబ్బయ్య, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

నాడు నేడు పనులను పూర్తి చేయాలి

ప్యాపిలి: పాఠశాలల్లో జరుగుతున్న మన బడి నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఉప విద్యాశాఖాధికారి (డీవైఈఓ) సుధాకర్ రెడ్డి ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఆయన హెచ్ఎంలతో సమీక్ష నిర్వహించారు. రెండో హెచ్ఎంలు నాడు నేడు పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. పాఠశాలలు పునఃప్రారంభం రోజే పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేయాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తీర్ణత శాతం పెంచడానికి హెచ్ఎంలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు, ఏపీఎం కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శివ పార్వతులకు పల్లకీ సేవ



శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లె: యాగంటి క్షేత్రంలోని శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో కొలువైన శివపార్వతులకు సోమవారం పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ బుచ్చిరెడ్డిల ఆధ్వర్యంలో ఉమామహేశ్వరులకు అభిషేకం ,అర్చన తదితర పూజలు చేశారు. సాయంత్రం శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుంచి పల్లకీ సేవా కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



రైతులకు సలహాలు అందిస్తున్న బనవాసి కేవీకే సైంటిస్ట్ డాక్టర్ కె.లక్ష్మణ్

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల పాఠశాల ఆవరణంలో రైతులకు బనవాసి కేవీకే సైంటిస్టులు డాక్టర్ కె.లక్ష్మణ్, డాక్టర్ టి.శ్రీచందన, వాటర్ షెడ్ అధికారులు (డబ్ల్యూడీసీ) పీఓ విజయత, జేయి రమణ, టీవో అండ్ సీబీ బ్రహ్మానంద రెడ్డి, టీఓ శివ నాగరాజు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమలపూరి బొందలదిన్నె వాటర్ చైర్మన్లు గౌరిగారి వెంకటేశ్వర రెడ్డి, తులసి రెడ్డి శ్రీరాంరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సబ్సిడీ వేరుశనగ పంపిణీ

ప్యాపిలి: స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రైతులకు సబ్సిడీపై వేరుశనగ కాయలను పంపిణీ చేవారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి,సర్పంచ్ లక్ష్మీదేవి, డోన్ మార్కెట్ యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డోన్ టౌన్: మండల పరిధిలోని ఉడుములపాడు గ్రామ రైతు భరోసా కేంద్రంలో సర్పంచ్ ఉప్పరి రాధ, వ్యవసాయ సహాయకుడు ఆనంద్ రైతులకు సబ్సిడీ వేరుశనగలను పంపిణీ చేశారు.

మోడల్ స్కూల్ విద్యార్థి ప్రతిభ



జిల్లా ఫారెస్ట్ అధికారితో బహుమతి అందుకుంటున్న విద్యార్థిని హరిణి

బనగానపల్లె రూరల్: స్థానిక ఏపీ మోడల్ స్కూల్ 10వ తరగతి విద్యార్థిని కె.హరిణి అటవీ శాఖ అధికారులు నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో జిల్లాలో మొదటి స్థానం దక్కించుకుందని ప్రిన్సిపాల్ రామలక్ష్మి తెలిపారు. సోమవారం నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వారు అంతర్జాతీయ పర్యావరణం దినోత్సవం సందర్భంగా మొక్కల పెంపకం- సంరక్షణ అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీలో విద్యార్థిని హరిణి పాల్గొని ప్రసంగించి జిల్లా అటవీశాఖ అధికారి వినీత్‌కుమార్, పర్యావరణ అధికారుల చేతుల మీదుగా సర్టిఫికెట్, జ్ఞాపికను అందుకునట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

అవుకు: పట్టణ సమీపంలోని హైస్కూల్ వద్ద విజిలెన్స్ అధికారి నాగరాజు యాదవ్ సోమవారం 600 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు. పట్టణానికి చెందిన డాన్ శ్రీను లారీలో పెద్ద మొత్తంలో రేషన్ బియ్యాన్ని తాడిపత్రి రహదారి నుంచి బనగానపల్లె వైపు తీసుకు వస్తున్నాడని సమాచారం అందటంతో నిఘా వేసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఆర్ఐ వెంగల్ రెడ్డి ఫిర్యాదు మేరకు డాన్ శ్రీను, రాముడు, నారాయణ రెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అధికారులకు సన్మానం



కృష్ణగిరి ఎంపీడీఓగా బదిలీపై వెళ్తున్న విశ్వమోహన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

డోన్: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ విశ్వమోహన్ ఎంపీడీఓగా పదోన్నతిపై కృష్ణగిరికి బదిలీపై వెళ్తుండటంతో ఆయనను రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు తదితరులు సన్మానించారు. అలాగే కోవెలకుంట్ల మండల పీఆర్ ఏఈగా బదిలీపై వెళ్తున్న డోన్ పీఆర్ ఏఈ మహేష్‌ను సన్మానించారు.

యువకుడి అదృశ్యం



రామక్రిష్ణ

బేతంచెర్ల: స్థానిక గాయత్రీ నగర్‌కు చెందిన వడ్డె సంపంగి రామక్రిష్ణ అదృశ్యమైనట్లు సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. గత నెల 27న ఇంటర్వ్యూ ఉందని ఇంట్లో చెప్పి హైదారాబాద్‌కు వెళ్లిపోయాడు. వారం రోజులవుతున్నా తిరిగి రాకపోవడంతో అతని సోదరుడు రామచంద్రుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపారు.

వలంటీర్లకు సత్కారం



డోన్: మండలంలోని కొత్రాయి సచివాలయం పరిధిలోని గుండాల, తిరునాంపల్లె వలంటీర్లను కొత్రాయి సర్పంచ్ ఆలంకొండ తేజోమణి సోమవారం ఘనంగా సత్కరించారు. ప్రభుత్వం అందించిన ప్రశంసా పత్రాలతో పాటు పురస్కారాలను అందజేశారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతి

డోన్ టౌన్: మండలంలోని తాడూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు లచ్చప్ప(80)అనారోగ్యంతో సోమవారం మధ్యాహ్నం మృతి చెందారు. మృతుని కుమారుడు తాడూరు ఎర్రిస్వామి డోన్ మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. లచ్చప్ప మృతి వార్త తెలిసిన వెంటనే మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సంతాపం తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

డోన్ టౌన్: మండల పరిధిలోని ఉడుములపాడు గ్రామ సమీపంలో ఉన్న చెరువు వద్ద మతిస్థిమితం లేని గుర్తు తెలియని వ్యక్తి(52) మృతి చెందినట్లు పట్టణ ఎస్ఐ నగేష్ సోమవారం తెలిపారు.

వృద్ధుడి బలవన్మరణం

బేతంచెర్ల: మండల పరిధిలోని గోర్లగుట్ట గ్రామానికి చెందిన లింగమూర్తి(60) బలవన్మరణానికి పాల్పడ్డాడు. సోమవారం సాయంత్రం ఇంటి ముందు కళ్లాపి చల్లే రంగు నీళ్లు తాగిన లింగమూర్తిని కుటుంబ సభ్యులు బనగానపల్లె ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రభుత్వ ధరలకే పాఠ్య పుస్తకాలు విక్రయించాలి

డోన్ టౌన్: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే పాఠ్య పుస్తకాలను విక్రయించాలని డిప్యూటీ డీఈఓ సుధాకర్ రెడ్డి సూచించారు. ఎంఈఓ కార్యాలయంలో సోమవారం మండల విద్యాధికారి ప్రభాకర్ అధ్యక్షతన ప్రైవేట్ పాఠశాలలు, విద్యా సంస్థలు యజమానులు, నిర్వాహకులతో సమావేశమై పలు సూచనలు చేశారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

సంజామల: మండల పరిధిలోని నొస్సం గ్రామంలో వెలసిన శ్రీ బుగ్గ వెంకటేశ్వర స్వామి ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలను సోమవారం ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మలికిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి ప్రారంభించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో పెద్ద కొట్టాల గోరేటి కేశవరెడ్డి, జిల్లెల్ల తేజేశ్వర్ రెడ్డి, కడప జిల్లా తాళ్లపనూరు ప్రసాద్ నాయుడు గంగిరెడ్డి వృషభాలు వరుసగా మొదటి మూడుస్థానాల్లో నిలిచి రూ.60 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు కైవసం చేసుకున్నాయి.

ప్రతి వస్తువునూ వినియోగించుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న పొదుపు మహిళలు

బేతంచెర్ల: ప్రతి వస్తువునూ జాగ్రత్తగా వాడుకోవాలని నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, కమిషనర్ రమేష్‌బాబు ప్రజలకు సూచించారు. సోమవారం మేరా లైఫ్, మేరా షహర్ కార్యక్రమంలో భాగంగా పొదుపు మహిళలు, నగర పంచాయతీ సిబ్బందితో కలిసి వారు ర్యాలీ నిర్వహించారు. నిరుపయోగంగా ఉన్న వస్తువులను నగర పంచాయతీ సిబ్బందికి అందజేస్తే ఉపయోగంలోకి తీసుకువస్తామన్నారు. ర్యాలీలో నగర పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేష్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్ నాయక్, టీపీ అంజద్‌బాషా పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికీ జగనన్న విద్యాకానుక



పాఠ్యపుస్తకాల సరఫరాను ప్రారంభిస్తున్న శ్రీరాములు

డోన్: పాఠశాలలు తెరిచిన మొదటి రోజే ప్రతి విద్యార్థికీ జగన్న విద్యాకానుక అందజేస్తామని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌లు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో డిప్యూటీ డీఈఓ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని పాఠశాలలకు ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను సరఫరా చేసే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్, హెచ్ఎం మైమున్నిసా, వైఎస్సార్‌సీపీ నాయకులు కొచ్చెర్వు మధు, దొరపల్లె చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నేడు సబ్సిడీ ట్రాక్టర్ల పంపిణీ

బనగానపల్లె: స్థానిక పొదుపు భవనం వద్ద డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవా పథం కింద మంజూరైన ట్రాక్టర్లను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మంగళవారం రైతులకు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 40 శాతం సబ్సిడీపై 58 ట్రాక్టర్లను పంపిణీ చేస్తున్నట్లు ఏఓ తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



ఆలయ పునర్నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాతలు

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రం మద్దిలేటి నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన కుంచె షోడా మద్దిలేటిరెడ్డి, సుశీలమ్మ దంపతులు రూ.1,01,016 విరాళంగా ఇచ్చారు. నగదును సోమవారం ఆలయ ఈఓ పాండురంగారెడ్డి, చైర్మన్ సీతారామచంద్రుడుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు స్వామి, అమ్మవార్ల ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి, స్వామి వారి పట్టు వస్త్రంతో సత్కరించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



ప్యాపిలిలో మొక్క నాటుతున్న పశువైద్యాధికారి రవికుమార్

బనగానపల్లె రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ హైమవతి సూచించారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాళ్ల కొత్తూరు గ్రామంలోని శివాలయం ఆవరణలో సర్పంచ్ వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో అవగాహన, మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డీఆర్ఓ హైమవతి మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల జల,వాయు,భూ కాలుష్యం విపరీతంగా జరిగి మానవ మనుగడకే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. అనంతరం సర్పంచ్ వెంకట్రామిరెడ్డితో కలిసి ఆలయ ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సిబ్బంది షాహీన్ షావలి, ముక్తార్ అహమ్మద్, సురేంద్రనాయుడు, భాస్కర్ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

● స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ వసుంధర ఆధ్వర్యంలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సూర్యనారాయణరెడ్డి,డాక్టర్ కోటేశ్వరరావులు,మహేశ్వరరెడ్డిపాల్గొన్నారు.

బేతంచెర్ల: సిమెంట్ నగర్ పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఫ్యాక్టరీ యాజమాన్యం, కార్మికుల ఆధ్వర్యంలో 300 మొక్కలు నాటారు. పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ వైస్ ప్రసిడెంట్ సుధాకర్‌రెడ్డి, జనరల్ మేనేజర్ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

ప్యాపిలి:పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని పశువైద్యాధికారి రవికుమార్ సూచించారు.ఏనుగుమర్రి గ్రామంలోని జగనన్న కాలనీలో సోమవారం జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం పశువైద్యాధికారి మాట్లాడుతూ పర్యావరణం కాలుష్యం కాకుండా ఉండాలంటే విరివిగా మొక్కలు నాటి వాటి ని పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీసు శ్రీనివాసులు, మెట్టుపల్లి పు రుషోత్తంరెడ్డి,శేఖర్,నాగరాజు,రమణయ్య పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: ప్రకృతిని రక్షించడం ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యంగా భావించాలని ఎస్ఐ రమేష్‌రెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ పరిసరాల్లో మొక్కలు నాటారు.

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ భారతి ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్స వం సందర్భంగా విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.

అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అటవీశాఖ ఆధ్వర్యంలో నగరవనంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డోన్ డిప్యూటీ రేంజర్ రమణారెడ్డి, ధర్మవరం గ్రామ వన రక్షణ సమితి అధక్షులు భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.